



'నవ్య' వారపత్రిక . . . 9 జూన్, 2004

హైదరాబాదుకు వెళ్ళే కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ రైల్వేస్టేషనులో ప్లాట్‌ఫారంపై బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

పవన్– చేతిలో లగేజీతో వడివడిగా ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ వైపు నడిచాడు. ట్రైనులో తన సీటు నంబరు చూసుకొని, లగేజి సీటు కింద పెట్టి కూర్చున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత అతని ఎదురుగా ఉన్న సీట్లో ఓ వ్యక్తి కూర్చోవడం చూశాడు.

దాదాపు నలభై ఏళ్లుంటాయి అతనికి. క్రీం కలర్ షర్టుపై బ్లాక్ కలర్ ప్యాంటు వేసుకొని టక్ చేసుకొని ఉన్నాడు. కళ్ళకు గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు ధరించి హుందాగా కనిపిస్తున్నాడు.

పవన్ అతనివైపు చూసి నవ్వుతూ–

"హలో... ఐ యామ్ పవన్!" అన్నాడు– తనను పరిచయం చేసుకుంటూ.

"హలో... ఐ యామ్ సాగర్! ...విద్యాసాగర్!" అన్నాడతను చేయి చాపుతూ. పవన్ కూడా చేయి చాపాడు.

తర్వాత ఇద్దరూ మాట్లాడుకోసాగారు.

సాగర్– తాను ఓ బ్యాంకులో స్కేల్ ఫోర్ ఆఫీసర్‌ననీ, ప్రస్తుతానికి ఇన్‌స్పెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో ఉండటం వల్ల ఎక్కువగా టూర్లు ఉంటాయనీ, హైదరాబాదులో సెమినార్‌లో పాల్గొనడానికి వెళుతున్నాననీ చెప్పాడు.

పవన్– తాను బి.టెక్. చేసి ఎం.బి.ఏ. చేశానని, కొన్ని ఫైనాన్షియల్ మ్యాగజైన్లకు కాలమిస్టుగా ఉన్నాననీ, తన ఆర్టికల్స్ ఎన్నో బహుమతులు గెలుచుకున్నాయనీ చెప్పాడు. ఇదివరకు చెన్నైలో ఓ కంపెనీలో పనిచేస్తూండేవాడిననీ, ఇప్పుడు హైదరాబాదులోని ఓ పెద్ద కంపెనీలో ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం వచ్చిందనీ, అందులో చేరడానికి వెళ్తున్నాననీ సాగర్‌తో చెప్పాడు.

"మీ ఇంటర్వ్యూ హైదరాబాదులో జరిగిందా?" సాగర్ అడిగాడు.

"లేదు. హైదరాబాద్ నుంచి టెలిఫోన్ ఇంటర్వ్యూ చేశారు. నా క్వాలిఫికేషన్స్ మెచ్చి, నా సమాధానాలు నచ్చి వెంటనే చెప్పారు– నేను సెలెక్ట్ అయ్యానని!"

"అదృష్టవంతులు! కదలకుండా ఉద్యోగం తెచ్చుకున్నారు."

అవునన్నట్టు తలూపాడు పవన్.

ట్రైను బయలుదేరింది.

వాళ్ళిద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. క్రికెట్, రాజకీయాలు, సినిమాలు... ఇలా అదీ ఇదీ అని లేకుండా ఎన్నో విషయాలు హైదరాబాదు చేరేంతవరకూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"మీరు హైదరాబాదులో ఎక్కడుంటారు?" సాగర్ పవన్‌ని అడిగాడు.

"లాడ్జిలో గది తీసుకుంటాను. రాత్రి విశ్రాంతి తీసుకుంటే రేపు ఫ్రెష్‌గా డ్యూటీలో చేరిపోవచ్చనే ఉద్దేశంతో ఈ ట్రైన్‌లో వచ్చాను."

"అయితే ఓ పని చేద్దాం! మనమిద్దరం కలసి ఓ డబుల్ రూమ్ తీసుకుందాం. కంపెనీ ఉంటుంది, డబ్బు కూడా ఆదా అవుతుంది."

"మంచి ఆలోచన!" అన్నాడు పవన్.

రాత్రి ఏడుగంటలకు హైదరాబాదు చేరారు.

నాంపల్లిలోని ఓ హోటల్‌లో గది తీసుకున్నారు.

"మీరు ఈ హోటల్‌కి తరచుగా వస్తూంటారా..?" పవన్ గదిలోకి ప్రవేశిస్తూ అడిగాడు.

"అవును. మాకు హైదరాబాదులో సెమినార్లు, మీటింగులు జరుగుతుంటాయి. నేను ఇక్కడికి ఎప్పుడొచ్చినా ఈ హోటల్‌లోనే దిగుతాను."

హోటల్ బాయ్ ఏ.సి. ఆన్ చేసి వెళ్లాడు.

సాగర్ స్నానం చేసొచ్చి మంచంపైన కూర్చున్నాడు. బాత్‌రూమ్‌లోకి పోబోతున్న పవన్‌తో "మీకు డ్రింక్స్ అలవాటుందా?" అని అడిగాడు.

"అప్పుడప్పుడు... ఏం?"

"మీకు అలవాటుంటే ఇక్కడికే తెప్పిస్తాను. లేకుంటే బార్‌కి వెళదామని అడిగాను."

"ఇక్కడికే తెప్పించండి. ఈలోగా నేను స్నానం చేసి వస్తాను."

"మీ ఛాయిస్ చెప్పండి!"

పవన్ చెప్పి బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. అతను బయటకి వచ్చేసరికి టీపాయ్ మీద అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇద్దరూ డ్రింక్స్ తీసుకుంటూ మాట్లాడుకోసాగారు.

"మీరు నాతో ఓ విషయం అబద్ధం చెప్పారు!" సాగర్ అన్నాడు కొద్దిసేపటి తర్వాత.

"ఏ విషయం?" ఆశ్చర్యంగా సాగర్ వైపు చూస్తూ అన్నాడు పవన్.

"మీరు అప్పుడప్పుడు తాగుతానని అన్నారు. మిమ్మల్ని చూస్తే నాకలా అనిపించట్లేదు."

"నేను అబద్ధం చెప్పాను మీతో! నిజం చెప్పాలంటే నేను పెద్ద బూజర్‌నే. అవకాశమొస్తే వదలను. అవకాశం కోసం ఎదురుచూస్తూ కూర్చోను" నవ్వుతూ అన్నాడు పవన్.

దాదాపు సగం బాటిల్ ఖాళీ అయ్యాక, "మీరు సెకండ్ షో సినిమా కెళ్తారా?" అని అడిగాడు.

"నాకు ఆసక్తి లేదు. మీకు వెళ్లాలని ఉంటే చెప్పండి... నేను కంపెనీ ఇస్తాను."

"నేను ఇక్కడే ఉండాలి... మౌనిక నాకోసం వస్తుంది."

పవన్ విషయం అర్థమైనట్లు నవ్వాడు. తరువాత "కొద్దిగా షాపింగ్ చేయాల్సివుంది. మీకోసం గంటన్నరసేపు షాపింగ్ చేస్తాను" అన్నాడు.

"థాంక్యూ! అయితే మౌనికను ఇప్పుడే బయలుదేరి రమ్మంటాను" అంటూ ఫోన్ దగ్గరికి వెళ్లి ఓ నంబర్ డయల్ చేశాడు.

"హలో మౌనికా... ఐయామ్ సాగర్!"

"................"

"హోటల్ అనురాగ్... రూమ్ నెంబర్ త్రీనాట్ టూ! పావుగంటలో ఇక్కడుండాలి... ఓ.కే.?" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"మౌనిక మీ గర్ల్‌ఫ్రెండా..?"

"కాదు... షి ఈజ్ ఏ కాల్‌గర్ల్!"

ఆశ్చర్యంగా సాగర్ వైపు చూశాడు పవన్.

"అంతగా ఆశ్చర్యపోకండి! మౌనిక సర్వీసెస్ ఓ చిన్నసర్కిల్‌కి మాత్రమే పరిమితం. అయితే ఫీజు ఎక్కువే! గంటకు వెయ్యి రూపాయలు ఛార్జి చేస్తుంది."

"కాస్ట్లీ!"

"ఆమెని చూస్తే మీరు ఆ మాట అనరు!" అన్నాడు సాగర్.

ఇంతలో... కాలింగ్ బెల్ మోగింది.

సాగర్ లేచి తలుపు తెరిచాడు.

ఎదురుగా... ఓ అమ్మాయి నిలబడివుంది. పాతికేళ్లుంటుంది ఆమె వయసు. తెల్లగా, పొడవుగా ఉంది. పొడవుకి తగ్గ లావు, చక్కటి అవయవ సౌష్టవం, నవ్వుముఖం చూస్తుంటే సాగర్ చెప్పింది నిజమేననిపించింది పవన్‌కి.

"మీట్ మిస్టర్ పవన్!" పవన్‌ని మౌనికకు పరిచయం చేశాడు సాగర్.

"నమస్తే..." చిరునవ్వుతో రెండుచేతులూ జోడించి అంది మౌనిక.

"నమస్తే!" అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు పవన్. ఆ తర్వాత వాళ్ళిద్దరూ మాట్లాడు కుంటుంటే వింటూ ఉండిపోయాడు శ్రోతలా.

కొంతసేపటితర్వాత పవన్ లేచి రెడీ అయి- "సాగర్‌గారూ... నాకు కాస్త పని ఉంది. బయటకి వెళ్లొస్తాను" అని, "వస్తానండీ..." అంటూ మౌనిక వైపు చూసి చెప్పాడు చెప్పులేసుకుంటూ.

సాగర్ కృతజ్ఞతాపూర్వకంగా బయటివరకు వచ్చి, "థాంక్యూ వెరీమచ్!" అన్నాడు.

పవన్ ఏదో చెప్పబోయి, మానుకొని, కాస్త ముందుకెళ్లి, మళ్లీ తిరిగివచ్చి "మీరేమీ అనుకోనంటే ఒక మాట!" అన్నాడు సాగర్‌తో.

"చెప్పండి..."

"మౌనికగారు తన చిన్నసర్కిల్‌లో నన్నూ చేర్చుకుంటారా..?" అని అడిగాడు.

సాగర్ అతనివైపు ఆశ్చర్యంగా చూసి, "వద్దు పవన్‌గారూ! నేనెటూ చెడాను. మిమ్మల్ని చెడగొట్టడం ఎందుకు? పైగా మీరు యువకులు, ఎంతో జీవితం, మంచి భవిష్యత్తు ఉన్నవారు- మీరు అలా ఆలోచించకండి!" అన్నాడు.

"ఇలాంటివి నాకు కొత్తేం కాదు. ప్లీజ్... నా రిక్వెస్ట్ ఇది! మౌనికగారు నాకెంతో నచ్చారు. ఎంత డబ్బైనా ఫరవాలేదు."

"సరే... మీరు గంట తర్వాత రండి! ఆ తర్వాత నేను షాపింగ్ చేస్తాను!" అన్నాడు సాగర్ నవ్వుతూ.

పవన్ ఉత్సాహంగా వెళ్లిపోయాడు.

●

గంటన్నర తర్వాత ఎంతో ఉద్వేగంతో హోటల్‌లోకి అడుగుపెట్టాడు పవన్.

గదికి తాళంవేసి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

రిసెప్షన్‌లో గది తాళంచెవులు తీసుకొని తాళం తెరిచాడు. టీపాయ్ మీద గ్లాసులు, బాటిల్స్ తీసివేయబడి శుభ్రంగా ఉంది.

'వాళ్ళిద్దరూ భోజనం చేయడానికి వెళ్లివుంటారేమో..!' అనుకుంటూ, మంచంపై కూర్చొని హోటల్ వాళ్ళకి ఫోన్ చేసి తనకు భోజనం గదికి పంపమని చెప్పాడు.

ఫోన్ పెట్టేస్తూ... ఫోన్ పక్కనేవున్న కాగితాన్ని ఆశ్చర్యంగా చూశాడు.

ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకొని చదవసాగాడు...

"మిస్టర్ పవన్...

మీ క్వాలిఫికేషన్స్, మీ సబ్జెక్ట్‌లో ప్రతిభ చూసి మిమ్మల్ని చూడకుండానే ఉద్యోగం ఇచ్చాం. అయితే... అతి ప్రతిష్ఠాత్మకమైన ఈ ఉద్యోగానికి క్రమశిక్షణ కలవాడు, ఎలాంటి ప్రలోభాలకు లొంగనివాడు మాకు కావాలి. అప్పుడే మా వ్యాపార రహస్యాలు మాతోనే ఉంటాయి. మీలాంటి వ్యక్తి అంత పెద్దపోస్టులో ఉంటే మా పోటీదార్లు మీ బలహీనతల్ని వాడుకొని మా రహస్యాల్ని తెలుసుకొనే అవకాశం ఉంది. అందుకే మీ అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ కాన్సిల్ చేస్తున్నాం.

నేను బ్యాంకు ఆఫీసర్ని కాదు. మీకు ఉద్యోగం ఇచ్చిన కంపెనీలో పర్సనల్ డిపార్ట్‌మెంట్లో కీలకమైన అధికారిని. మౌనిక మా స్టాఫ్ మెంబర్.

మీ తిరుగు ప్రయాణానికి వెయ్యి రూపాయలు మీ సూట్‌కేస్ పైన పెట్టాను.

మిమ్మల్ని ఈ విధంగా పరీక్షించినందుకు క్షమించండి.

ఇది నా విధి నిర్వహణలో ఓ భాగం!"


## మీరు చదివారా..?

### సి.ఎన్. చంద్రశేఖర్ ఇతర రచనలు



**స్రవంతి** ( నవల ) వెల : రూ|| 50/-

నవ, యువ రచయిత... **సి.ఎన్. చంద్రశేఖర్** కలం నుండి-

చదువు పూర్తిచేసి, ఉద్యోగరీత్యా పరాయి ఊరికి వచ్చిన ఓ అందమైన అమ్మాయి తనకు ఎదురైన విపత్కర పరిస్థితుల నుంచి బయటపడిన వైనం. ఓ అనుమానం ఎన్ని అనర్థాలకు కారణమౌతుందో, ఓ వ్యక్తిలోని అసూయ ఎన్ని కల్లోలాలను సృష్టిస్తుందో తెలుపుతూ పాఠకుల్ని పేజీల వెంట పరుగెత్తింపజేసే సస్పెన్స్ థ్రిల్లర్ నవల... ఈ స్రవంతి.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

## జయంతి పబ్లికేషన్స్

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన పూర్తి కేటలాగ్ కోసం మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.